కథావేదిక

# జ్ఞాపకం

– తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

ఆడిటోరియం అంతా హడావిడిగా వుంది. అందుకు కారణం లేకపోలేదు. ''వ్యక్తీ... ఎంత నీ జ్ఞాపకశక్తి?!'' పుస్తకం రాసిన చెంగల్వారావుకి సన్మానం! సభ మొదలవ్వడానికి ఇంకా ఎంతో సమయం లేదు. అయినా సదరు రచయిత పత్తాలేడు. చందాలు తీసుకుని (రచయిత దగ్గరే) సన్మానం చేసే అక్కడున్న స్వచ్ఛంద కార్యకర్తలు గాభరా పడుతున్నారు.

• • •

అదే సమయంలో–

చెంగల్వారావు ఇంటిదగ్గర తన సన్మానం సంగతి మర్చిపోయి తన భార్యతో చదరంగం ఆడుతున్నాడు. తన మంత్రిని జరిపి ''మీరే ఎత్తెయ్యాలి'' అంది అతని భార్య మహంకాళి. చెంగల్వారావు అప్పుడే ఆడాల్సిన ఆట మర్చిపోయి అక్కడే ఇల్లూడుస్తోన్న పనిమనిషి రంగి ఎత్తుపల్లాలు పరిశీలిస్తున్నాడు.

''మీదే ఆట'' హుంకరించింది మహంకాళి– అతని పని చూసి.

''ఓహ్ మర్చిపోయాను'' అన్నాడు చెంగల్వారావు భయం భయంగా!

అంతలో వాచీ చూసిన మహంకాళి ''అయ్యబాబోయ్... మీకివాళ సన్మానం తగలబడింది కదూ! బోలెడు డబ్బు పోసి చేయించుకుంటున్నారు. అయినా గుర్తుండి చావకపోతే ఎలా? పోనీ నాకైనా గుర్తురాకపోవడం ఖర్మ కాకపోతే ఏంటీ? సావాస దోషం. లేచి తయ్యారై ఏడ్వండి!'' అంటూ గబగబా తయారవ్వసాగింది.

మహంకాళి చీర ఎంచుకుంటుంటే ఆమె పక్కన పిల్లిలా చేరిన చెంగల్వారావు ''నాకెందుకు సన్మానం?'' అంటూ అడిగాడు. నుదురు బాదుకుని ''మీరు ఏదో పుస్తకం రాసి ఏడ్చారు కదా! ఆ పేరేంటో నాకూ గుర్తులేదు. ఆ పేపర్లో చూడండి'' అంటూ విసుక్కుంది. ''ఏ పేపరు? ఎక్కడ పెట్టానో?!'' అని నిట్టూరుస్తున్న భర్తకేసి చూసి బాధగా నిట్టూర్చింది. ఆమె నోట్లోంచి వచ్చిన ఆ గాలికి ఆ పాంప్లెట్ రెపరెపలాడుతూ ఎగిరింది.

''అదిగో! ఆ కాగితమ్మీద చూసి ఏడిస్తే ఆ పుస్తకం పేరు గుర్తుకొచ్చి చస్తుంది!'' కోపంగా చిందులు తొక్కుతూ అంది మహంకాళి.

ఆమె చీర ఎంచుకునేసరికి చెంగల్వారావు తయ్యారై పోయాడు. ఇద్దరూ కలసి సభ దగ్గరికి బైల్దేరబోతుంటే చెంగల్వారావు బావమరిది గిరీశం ఎదురొచ్చాడు.

''బావా... బావా... మీతో నేనూ వస్తాను'' అన్నాడు గిరీశం.

''ముగ్గురెళితే ఆ పని కాస్తా ముక్కలై చస్తుంది! నువ్వు తయ్యారై అరగంట తర్వాత బైల్దేరు'' అంటూ తన తమ్ముడుతో తెగేసి చెప్పింది మహంకాళి.

''అలాగే'' గిరీశంకి తెల్సు. అలాంటి సభలు ఎంత లేటుగా మొదలవుతాయో. అందుకే గంట లేటుగా బైల్దేరడానికి నిశ్చయించుకున్నాడు.

• • •

ఆడిటోరియం గేటు దగ్గర చేతులు పిసుక్కొంటూ వాచీలు చూసుకుంటూ చెంగల్వారావు కోసం ఎదురు చూస్తున్నారు భజనమేళం.

చెంగల్వారావు రాగానే స్వాగత సత్కారాలు అందజేసి (మనసులో తిట్టుకుంటూ) సభ లోపలికి తీసుకెళ్లారు.

సభ ప్రారంభమైంది.

వేదికనెక్కి కూర్చున్నాడు చెంగల్వారావు. ఆరోజు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ సినీ నటుడు, దర్శకుడు శంభులింగం చెంగల్వారావు పక్కనే కూర్చున్నాడు (నిజానికి ఆ నటుడు మాజీ కాదు. అతనికి సినిమాల్లో నటిద్దామనే వుంది. కానీ జనాలు తాను నటించే సినిమాపై కేజీలకొద్దీ టమాటాలు, టన్నుల కొద్దీ పాత చెప్పులు విసురుతుంటే రాజీ పడి మాజీ అయ్యాడు).

శంభులింగం మాట్లాడడం మొదలుపెట్టాడు. మైక్ చూడగానే అతనికి కిక్ వచ్చింది. లైట్లూ, జన కోలాహలం అతనిలోని నటుణ్ణి పైకి తీసుకొచ్చాయి. చెంగల్వారావు గురించి అతనికి తెలియకపోయినా అతణ్ణి ఆకాశానికి ఎత్తేస్తున్నాడు శంభులింగం. అక్కడ్నుంచి ఎప్పుడు పడతానో అని అనుకుంటూనే వేదిక మీదే కునుకు తీయడం ప్రారంభించాడు చెంగల్వారావు. సభలో జనం కొద్దిమందే అయినా శంభులింగం చేస్తున్న ప్రసంగానికి హాహాకారాలు మొదలుపెట్టారు. వేదిక కింద కుర్చీల్లో కూర్చున్న మహంకాళి భర్త గురించి– శంభులింగం చెప్పే మాటలు పట్టించుకోకుండా, తను కట్టుకున్న పట్టుచీర నెవ్వరైనా పట్టించుకుంటున్నారా లేదా అని తెగ ఉబలాటపడుతోంది (అయితే ఆమెనెవరూ పట్టించుకోలేదన్న సంగతి ఆమెకి తెలిసినా ఆ విషయం పట్టించుకోదు– అది వేరే సంగతి).

శంభులింగం మాట్లాడి, మాట్లాడి అలసిపోయి ''ఇప్పుడు చెంగల్వారావు మాట్లాడుతారు'' అంటూ తన సీట్లో కూర్చున్నాడు.

చెంగల్వారావుకి ఆ మాటలు వినబడలేదు. హాయిగా కునుకు తీస్తున్నాడు. హాహాకారాలు చేస్తున్న జనం కాస్తా తన భర్త మీద కారాలు మిరియాలు నూరుతుంటే గబగబా వేదిక పైకి వెళ్లి చెంగల్వారావును లేపి మాట్లాడండి అంటూ టెలిగ్రామ్‌లా చెవిలో చెప్పింది.

ఏమిటి మాట్లాడాలో మర్చిపోయిన చెంగల్వారావు శంభులింగాన్ని చూస్తూ ''ప్రజలారా! నేటి మన సినిమాలు తగలబడ్డానికి కారణం ఎవరు? జనమా, నిర్మాతలా, దర్శకులా, డిస్ట్రిబ్యూటర్లా, సినీ నటులా, ప్రభుత్వమా, ఎవరు? ఎవరు కారణం?!'' అంటూ ప్రశ్నించేసరికి–

''నువ్వెవర్తె?! ప్రశ్నలే వేస్తున్నావ్? దమ్ముంటే జవాబు చెప్పు?'' అని ఒళ్లు మండిన సభికుడొకడు కేకేశాడు.

సభ అభాసుపాలవుతోందని గ్రహించిన మహంకాళి భర్త చెవిలో అసలు విషయం టూకీగా చెప్పింది.

''అహ్హహ్హ!!'' అంటూ భయంకరంగా నవ్వాడు చెంగల్వారావు.

నవ్వి ''చూశారా?! నాకు మతిమరుపు వుందనుకున్నారు కదూ! ఒకదానికొకటి పొంతన లేకుండా మాట్లాడుతున్నానా అని మీ డౌట్ కదూ! ఇలాంటి మతిమరుపు పోవాలంటే మన శంభులింగం గారు రాసిన 'వ్యక్తీ..ఎంత నీ జ్ఞాపకశక్తి' పుస్తకం చదవాలి!'' అంటూండగానే–

అతని వెనకనే నిల్చొన్న మహంకాళి భర్త చెవి పట్టుకుని ''ఆ పుస్తకం రాసింది మీరే! శంభులింగం, భజగోవిందం కాదు'' చెప్పగానే ''ఓహ్ మర్చిపోయాను. నేను రాసిన ఆ పుస్తకం చదివితే మీకు జ్ఞాపకశక్తి పెరిగి విజ్ఞానవంతులౌతారు'' అంటూ ఇంకా ఏవో మాట్లాడి మైక్ వదిలి తన సీట్లో కూర్చున్నాడు.

సభ నిర్వాహకులు గబగబా శంభులింగానికి ఒక

మెమెంటో, చెంగల్వారావుకి ఒక మెమెంటోతో ఒక వెయ్యి నూట పదార్ల చెక్కు (ఆ ఖర్చంతా నిజానికి చెంగల్వారావుదే) ఇచ్చి వీడ్కోలు చెప్పేసి సభ ముగించారు.

• • •

తనతోపాటు తన భార్య వచ్చిందన్న సంగతి మర్చిపోయిన చెంగల్వారావు ఆడిటోరియం బయట మోటారుసైకిల్‌పై వెళ్తోన్న ఒకతన్ని ఆపి లిఫ్ట్ అడిగాడు. ఆ వ్యక్తి ఆ సభకు రావటం చేత ''ఏం సార్! అమ్మగారు ఇంటికెళ్లిపోయారా?'' అని అడిగాడు.

''అప్పుడు తన భార్య విషయం గుర్తుకొచ్చి ''మర్చిపోయాను మీరెళ్లండి'' అంటూ అతన్ని పంపించేశాడు. ఆ వ్యక్తి చెంగల్వారావును ఆపాద మస్తకం పరిశీలించి, అదోకలాగ చూస్తూ వెళ్లిపోయాడు.

ఇంతలో అతన్ని వెదుక్కుంటూ మహంకాళి ఎదురుగా వస్తోంది. ఆమెను చూసిన చెంగల్వారావు ఆమె దగ్గరకెళ్లి ''ఏమండీ... నా భార్య ఎక్కడుందో కాస్త చెబుతారా?!'' అని ప్రశ్నించాడు.

''నేనే ది గ్రేట్ రైటర్ చెంగల్వారావు భార్యని!'' అని వెటకారంగా మహంకాళి.

''హబ్బే నేనడిగింది మీరెవరి భార్య అని కాదు! నా భార్య ఏదీ అని!'' మళ్లీ అడిగాడు చెంగల్వారావు.

''హయ్యో ఖర్మ! నేనండీ మీ భార్య మహంకాళిని!'' వివరించింది మహంకాళి.

అటుపక్కనుంచి వెళ్తోన్న ఒక స్టూడెంట్ చెంగల్వారావు దగ్గరకు వచ్చి–

''సార్... ఆటోగ్రాఫ్'' అంటూ అడిగాడు.

''సారీ బాబూ... పెన్ను మర్చిపోయాను'' అపాలజీగా చెంగల్వారావు.

''ఇదిగోండి సార్! నా పెన్ను'' ఆ కుర్రాడు పెన్నందించాడు.

సంతకం పెట్టి ఆ పెన్నుని తన జేబులో పెట్టేసుకున్న చెంగల్వారావుతో–

''సార్! నా పెన్ను!!'' కుర్రాడి కేకతో–

''సారీ! మర్చిపోయాను'' అంటూ పెన్నందించాడు చెంగల్వారావు. వీళ్లని వెదుక్కుంటూ చెంగల్వారావు బావమరిది గిరీశం వాళ్లను చూసి ఎదురెళ్లి ''అక్కా సభ ఎలా అయింది. బాగా అయిందా? దార్లో మా ఫ్రెండ్స్‌తో మాట్లాడి వచ్చేసరికి ఆలస్యమైంది'' అన్నాడు.

''ఆ ... అయింది'' నిస్సారంగా అంది మహంకాళి.

''అక్కా! నీ పర్స్‌లో దువ్వెనుంటే ఇవ్వు!'' అడిగాడు గిరీశం. అతనికి తెలుసు తన అక్కడ పర్స్‌లో మొత్తం మేకప్ సామానుంటుందని.

''మర్చిపోయాన్రా హడావిడిలో'' దిగాలుగా చెప్పింది మహంకాళి.




''చూశావా! నాకంటావు మతిమరుపని! ఇదిగో నాదగ్గరుంది దువ్వెన!'' అంటూ చెంగల్వారావు ఆ దువ్వెన తీసి బామ్మర్దికందించాడు.

''మరదే మతిమరపంటే! తలపైన జుత్తు లేదన్న సంగతి మరిచిపోయి దువ్వెన పెట్టుకోవడం ఏంటీ?'' నిలదీసింది మహంకాళి.

తన అక్క బావను పట్టుకుని వెక్కిరించడం చూడలేక గిరీశం తన బావతో అడిగాడు.

''బావా! ఈ పుస్తకం నిజంగా నువ్వు రాసిందేనా?!''

''నువ్వు దగ్గరవాడివి కాబట్టి చెబుతున్నా! నాదగ్గరో ఘోస్ట్ రైటర్ సుబ్బారావు అని వున్నాడ్లే. వాడే రాశాడు'' అంటూ నిజాయితీగా చెప్పేశాడు చెంగల్వారావు.

''మరి అన్ని విషయాలు మర్చిపోతుంటావు కదా! ఆ సుబ్బారావునెందుకు మర్చిపోలేదు?!''

''ఎలా మర్చిపోతాను! వాడికి నా మతిమరుపు సంగతి తెలుసు. ఎక్కడ వాడికి డబ్బులివ్వడం మర్చిపోతానో అని దెయ్యంలా నావెంట పడుతుంటాడు. మీ అక్కకున్న పబ్లిసిటీ పిచ్చి కోసం ఇలా చెయ్యక తప్పడం లేదు'' ఇంకా ఏదో చెప్పబోతోన్న వాడు కాస్తా–

''అదిగో సుబ్బారావు వస్తున్నాడు. ఈ చెక్కు చూశాడంటే లాక్కుంటాడు. లేనిపోని చిక్కులు తప్పవు'' అంటూ చిక్కని ఆ చీకట్లోకి పరుగెత్తాడు. అతనికి తర్వాత ఇల్లు వెదుక్కొనే ఇబ్బంది ఎదురవుతుందని అతని వెనకాల మహంకాళి, ఆమె వెనుక ఆమె తమ్ముడు గిరీశం, ఈ ముగ్గురిని చూసిన సుబ్బారావు ఆ చీకట్లో పరుగెడుతూనే వున్నారు. అంత రాత్రి వాళ్లని పోలీసులు చూడకూడదని కోరుకుందాం. లేకపోతే పోలీసులు కూడా వారివెంట పరుగెడతారు.

★